అడుగడుగునా కూటమి అడ్డంకులు


పోలీసులతో మాట్లాడుతున్న తిరుపతి, చిత్తూరు జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన


చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు

- గోశాలకు వెళ్లేందుకు యత్నించిన వైఎస్సార్‌సీపీ నేతల గృహ నిర్బంధం
- ఆవుల మరణంపై బహిరంగ చర్చకు సిద్ధమైన వైఎస్సార్‌సీపీ
- పోలీసులను అడ్డు పెట్టుకుని గోశాలకు వెళ్లకుండా అడ్డంకులు

చంద్రగిరి: ఇటీవల తిరుపతి గోశాలలో జరుగుతున్న దారుణాలను వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి ప్రజల ముందుకు తేవడంతో కూటమి ప్రభుత్వం ఉలిక్కిపడింది. ఒకవైపు టీటీడీ ధార్మిక సంస్థలో వరుస దారుణాలు కూటమి సర్కారును నైరాశ్యంలోకి నెట్టేస్తుంటే.. ఇప్పుడు గోశాలలో ఆవుల మరణాల అంశం కూటమి నేతలకు మింగుడు పడడం లేదు. తాజాగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఎక్స్ వేదికగా గోశాలలో ఆవులు చనిపోయినట్లు నిరూపించండి అంటూ చేసిన సవాల్‌ను స్వాగతించిన భూమన కరుణాకరరెడ్డి బహిరంగ చర్చకు సిద్ధమయ్యారు. దీనిపై భయపడిపోయిన కూటమి నేతలు పోలీసులను అడ్డుపెట్టుకుని గోశాలకు రాకుండా అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. గురువారం ఉదయం తిరుపతి రూరల్ తుమ్మలగుంట సమీపంలోని ఎస్వీ తిరుపతి నగరంతో పాటు చంద్రగిరి నుంచి వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా పెద్దఎత్తున పార్టీ శ్రేణులు తరలివచ్చారు. అయితే గురువారం తెల్లవారుజామున నుంచే పోలీసులు తిరుపతి నగరంతో పాటు చంద్రగిరి నియోజకవర్గంలోని నాయకులను వారి ఇళ్ల వద్దే పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

అసలు భయమెందుకు..?

గోశాలలో జరిగిన ఘటనపై నిజాలను నిరూపిస్తామంటే కూటమి నాయకులకు భయమెందుకు ? అని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 10 నెలల్లో వందలాది గోవులు మృతి చెందడం నిజం కాదా ? అని ప్రశ్నించారు. సాక్షాత్తు గోశాల ఇన్‌చార్జ్ గతేడాది మే నెల నుంచి ఇప్పటి వరకు సుమారు 190కు పైగా గోవులు మృతి చెందాయని నిర్ధారించారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సవాల్ చేయడంతో నిరూపించేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధం కాగా నిజాలు బహిర్గతం అయితే ప్రభుత్వ పరువు పోతుందని అధికార పార్టీ నాయకులు పోలీసులతో కుట్రలు పన్నారని ఆరోపించారు. కూటమి పాలనపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, ఈ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వారు స్పష్టం చేశారు.


పోలీసుల అదుపులో తిరుపతి నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్ర రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లాని బాబు, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు పద్మజ, మురళి, రాజేశ్వరి


పోలీసుల అదుపులో కార్పొరేటర్ సంధ్య, కార్పొరేటర్ అనీష్ రాయల్, గీతా యాదవ్, అరుణ్ యాదవ్, మల్లం రవి, బాలాజీ, మైనారిటీ నేత ఇమ్రాన్, అనిల్‌కుమార్ రాయల్


పోలీసుల అదుపులో తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, రామచంద్రాపురం వైస్ ఎంపీపీ కుప్పం భాస్కర్ యాదవ్, చంద్రగిరి సింగిల్‌విండో మాజీ చైర్మన్ దేవారెడ్డి, అగరాల సర్పంచ్ భాస్కర్ రెడ్డి, సోషల్ మీడియా అధ్యక్షుడు పటాన్ రహీం, చిన్నగొట్టిగల్లు మండల అధ్యక్షుడు సింహాల మోహన్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు చిన్నయాదవ్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చెంచు మోహన్ యాదవ్, పేరూరు సర్పంచ్ దామినేటి కేశవులు, బ్రహ్మణపట్టు ఎంపీటీసీ యోగానంద రెడ్డి

క్లుప్తంగా

నైపుణ్యాభివృద్ధితోనే వ్యక్తిత్వ వికాసం


అవగాహన కల్పిస్తున్న జిల్లా పోలీస్ శాఖ శక్తి టీం

తిరుపతి ఎడ్యుకేషన్ : నైపుణ్యాభివృద్ధితోనే వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని ఏఎస్ఐ గిరిజ తెలిపారు. తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో గురువారం వేసవి సెలవులను ఎలా సద్వినియోగం చేసుకోవాలన్న అంశంపై ఎస్పీ ఆదేశాల మేరకు శక్తి టీమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో అసాంఘిక కార్యక్రమాలకు, చెడు అలవాట్లు, సావాసాలకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. దీనికోసం అకడమిక్ విద్యతో పాటు వివిధ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు. అలాగే ఈవ్ టీజింగ్, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉంటూ వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రకాష్‌బాబు, మహిళా హెడ్ కానిస్టేబుల్ శాంతి, సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం


సరస్వతి పూజలో పాల్గొన్న హెచ్‌ఎం

పాకాల : స్థానిక ఎస్‌వీఎస్ పాఠశాల ఆవరణలో పాఠశాల వార్షికోత్సవాన్ని పాఠశాల హెచ్‌ఎం మోహన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం పాఠశాలలో సర్వతి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులందరికి స్వీట్లను పంచి పెట్టారు. అలాగే సాయంత్రం పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు నాటికలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు బాబ్జి, లింగయ్య, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, సర్పంచ్ కస్తూరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేసవి వినోదం


ప్రత్యేక ప్రతిభావంతుల పిల్లలతో ప్రేరణ హెల్పింగ్ సొసైటీ ప్రతినిధులు

తిరుపతి ఎడ్యుకేషన్ : రాస్, అక్షయక్షేత్రంలోని సుమారు 65 మంది ప్రత్యేక ప్రతిభావంతుల చిన్నారులు వేసవి వినోదాన్ని ఆస్వాదించారు. ప్రేరణ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో వీరిని చంద్రగిరి సమీపంలోని బ్లూ ల్యాండ్ వాటర్ పార్క్‌కు తీసుకెళ్లి వారికి వేసవి వినోదాన్ని పంచారు. చిన్నారులు వాటర్ పార్క్‌లో సందడి చేస్తూ వేసవి వినోదాన్ని పొందారు. అందరి పిల్లలానే వీరికి వినోదం అందించాలన్న సత్సంకల్పంతో పలువురి దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రేరణ హెల్పింగ్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు.

గణితంపై పట్టు ఉండాలి


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అతిథులు, సంస్థ చైర్మన్

తిరుపతి సిటీ: ప్రస్తుత పోటీ ప్రపంచంలో నెగ్గాలంటే గణితంపై పట్టు ఉండాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ రాయలసీమ రీజినల్ అధ్యక్షుడు డాక్టర్ విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. స్థానిక బైరాగిపట్టెడ ఆర్చ్ సమీపంలోనే ఆర్కే అబాకస్ ఎడ్యుకేషన్‌లో గురువారం జరిగిన వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆర్‌కే అబాకస్ డైరెక్టర్ ఆర్కే విమలా రెడ్డి, ఆర్కే బ్యాకస్ ఎడ్యుకేషన్ చైర్మన్ డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మేధోశక్తికి అబాకస్ విద్య దోహద పడుతుందన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఇలాంటి విద్యను అందించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలన్నారు. వేసవి శిక్షణ శిబిరాల కోసం ఎంఆర్ పల్లి 9989500074, కేటీ రోడ్డు 7386502450, బైరాగిపట్టెడ 9000976246 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వేసవి శిబిరం పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థల వేసవి శిక్షణ శిబిర వాల్‌పోస్టర్‌ను గురువారం నెల్లూరులో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి గృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గత 35 ఏళ్లుగా జాతీయస్థాయి ప్రవేశ పరీక్షలైన సైనిక్, మిలిటరీ స్కూల్, నవోదయ, పాలిటెక్నిక్ వంటి పోటీ పరీక్షలకు విద్యార్థులకు శిక్షణ అందిస్తూ రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకులు సాధిస్తుండడం గర్వకారణమని తెలిపారు. ఎందరో విద్యార్థులు ఆయా విద్యాసంస్థల్లో సీట్లు సాధించేలా తీర్చిదిద్ది వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారని, ఎందరో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల మన్ననలు పొందుతూ జాతీయస్థాయిలో గుర్తింపు పొందారని కొనియాడారు. అనంతరం విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ వేసవి సెలవులు వృథా కానివ్వకుండా పిల్లల భవిష్యత్ దృష్ట్యా మ్యాథ్స్, రీజనింగ్ సైన్స్, ఇంగ్లిష్ గ్రామర్ తదితర అంశాలపై పట్టు సాధించడానికి వేసవి శిబిరాలు ఉపయోగపడతాయని.. ఆసక్తి ఉన్నవారు 93999 76999, 86888 88802 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో అపుస్మా నాయకులు భాస్కర్‌రాజు, రామకృష్ణారెడ్డి, ఎస్ఎం బాషా, రఘునారాయణరావు, జనార్దన్ రెడ్డి, వెంకటేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆగని బాంబు బెదిరింపులు


బ్యాంక్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

తిరుపతి క్రైమ్: తిరుపతి నగరానికి బాంబు బెదిరింపుల గోల ఎక్కువవుతోంది. తాజాగా కేటీ రోడ్‌లోని ఓ బ్యాంకుకు బాంబు బెదిరింపు కాల్ వచ్చిన ఘటన గురువారం చోటుచేసుకుంది. అలిపిరి పోలీసుల కథనం .. కేటీ రోడ్డులోని సౌత్ ఇండియన్ బ్యాంక్‌కు ఓ గుర్తు తెలియని ఈమెయిల్ నుంచి బ్యాంకులో బాంబు పెట్టినట్టుగా బెదిరింపు కాలు వచ్చింది. బ్యాంకు సిబ్బంది అలిపిరి పోలీసులకు సమాచారం అందించారు. ఆపై బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ చేత తనిఖీ చేశారు. పరిసర ప్రాంతాల్లోని అనుమానిత వస్తువులను పరిశీలించారు. అయితే ఎక్కడా బాంబు ఆనవాళ్లు లేకపోవడంతో ఆకతాయిల పనిగా పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

చట్టాలను తుంగలో తొక్కుతున్న బీజేపీ


నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

తిరుపతి అర్బన్: అధికారబలంతో బీజేపీ ప్రభుత్వం చట్టాలను తుంగలో తొక్కేస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగురవం బాబు, తిరుపతి నగర అధ్యక్షుడు చిట్టిబాబు, పీసీసీ ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్‌పార్టీ జాతీయ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీతో పాటు పలువురురిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలంటూ గురువారం కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ చేతిలో కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐ, ఎన్ఐఏ కీలుబొమ్మల్లా మారాయని మండిపడ్డారు. బీజేపీ అనుసరిస్తున్న జాతీయ, ప్రజా వ్యతిరేక విధానాలను పార్లమెంట్‌లో ప్రశ్నిస్తున్న కాంగ్రెస్‌ను కనుమరుగు చేయాలనే దుర్మార్గపు ఆలోచనతో మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ లోకేశ్వర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, ఇతర నేతలు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అన్యాయం


ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులకు అన్ని అంశాల్లో తీవ్రమైన అన్యాయం జరుగుతోందని.. న్యాయం కోసం పోరాటాలు చేస్తున్నామని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ జిల్లా కార్యదర్శి బీఎస్ బాబు వెల్లడించారు. తిరుపతి డిపో నేతృత్వంలో గ్యారేజ్ వద్ద ఆర్టీసీ ఉద్యోగులు ప్లకార్డులతో న్యాయం కోసం ధర్నా చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా ఉద్యోగులకు న్యాయం జరగడం లేదని మండిపడ్డారు. ప్రధానంగా అక్రమ సస్పెన్షన్, రిమూవల్‌ను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలు కేటాయింపు చేయాలన్నారు. ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్యమే పునరుద్ధరించాలని తెలియజేశారు. ఉద్యోగులకు న్యాయం చేయకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఉమ్మడి జోనల్ అధ్యక్షుడు డీవీఆర్ కుమార్, జిల్లా ట్రెజరర్ సతీష్, రీజనల్ కమిటీ నాయకులు తిరుపతి డిపో చైర్మన్ రమణయ్య, అధ్యక్షులు భాస్కర్, కార్యదర్శి దాము, తిరుమల డిపో చైర్మన్ నేతాజీ, అధ్యక్షులు వీవీకే నాయుడు, కార్యదర్శి రమణయ్య రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 5 గంటలకు ×పూలే, అంబేడ్కర్ ఆలోచనలు– నేటి ఆవశ్యకత అనే అంశంపై సమావేశం
- తిరుమలలోని వేద పండిత పాఠశాలను ఉదయం 10 గంటలకు సందర్శించనున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్ పర్సన్, సభ్యులు
- ఎస్వీయూనివర్సిటీ పరిధిలోని పీజీ కళాశాలల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు సైన్స్ గ్రూప్ కోర్సుల 4వ సెమిస్టర్ పరీక్షలు
- ఎంఆర్ పల్లి, రైతుబజార్ వైకుంఠపురం వద్ద ఉదయం 9 గంటలకు ఎస్ఎల్ఆర్ శ్రీగంధం ఫామ్ ల్యాండ్ ప్రాజెక్టు కార్యాలయం ప్రారంభోత్సవం
- తిరుపతి ఈస్ట్ సెక్షన్‌లోని 33/11 కేవీ ఫీడర్స్‌లో మరమ్మతులు, విద్యుత్ లైన్ల తొలగింపు కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొర్లగుంట, వినాయక నగర్, తుడా రోడ్డు, తాతయ్యగుంట పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం
- బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో ఉదయం 11.30 గంటలకు ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశం

రాయల్ నగర్‌లో ఆటో చోరీ

తిరుపతి క్రైమ్: నగరంలో ఆటో చోరీ జరిగిన సంఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్వీ యూనివర్సిటీ సీఐ రామయ్య తెలిపిన వివరాల మేరకు.. రాయల్ నగర్ సమీపంలోని బండారు నగర్‌లో నివాసం ఉంటున్న మురళి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతిరోజు వారి ఇంటి సమీపంలో ఖాళీ గ్రౌండ్‌లో ఆటోను ఉంచి నిద్రించేవాడు. ఇదే క్రమంలో గురువారం ఉదయం చూసేసరికి ఆటో లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఆమె ఆరోపణలు అవాస్తవం'

తిరుపతి సిటీ: తిరుపతి రూరల్ మండలం ఎంఆర్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన భూవివాద కేసులో శ్రీదేవి అనే మహిళ చేసిన ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని బాధితుడు మురళీధర్ రెడ్డితో కలసి న్యాయవాది క్రాంతిచైతన్య తెలిపారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. నాగిరెడ్డి కుమారుడు మురళీధర్ రెడ్డి.. ప్రదీప్ అనే వ్యక్తి వద్ద రూ.2.30 కోట్లతో శ్రీనివాసపురంలో ఇంటిని కొనుగోలు చేశాడని తెలిపారు. కాగా శ్రీదేవి అనే మహిళ ఇటీవల దౌర్జన్యంగా తనది కాని ఆస్తిపై మీడియా సమావేశం ఏర్పాటు చేసి భవనాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఆ ఇంటిపై శ్రీదేవికి ఎటువంటి హక్కు లేదని ఆయన తెలిపారు.

భక్తులకు అన్నదానం


భక్తులకు అన్నదానం చేస్తున్న దాత తొండమనాటి వెంకటేష్‌రెడ్డి దంపతులు

తిరుపతి కల్చరల్: బండ్ల వీధి శ్రీఆంజనేయస్వామి భజన మందిరంలో శ్రీరామనవమి వేడుకల ముగింపు సందర్భంగా లక్ష్మీ నారాయణ హార్డ్ వేర్స్ అధినేత, టౌన్‌బ్యాంక్ మాజీ చైర్మన్ తొండమనాటి వెంకటేష్‌రెడ్డి దంపతులు గురువారం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రంగస్థలి ప్రతినిధులు, కళాకారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయండి

తిరుపతి కల్చరల్: గత ఎన్నికల సమయంలో నాయీ బ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను పబ్లిసిటీతో సరిపెట్టకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేసి ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయీ బ్రాహ్మణ విభాగం అధ్యక్షుడు తొండమల్ల పులయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల పర్యటన నేపథ్యంలో నాయీ బ్రాహ్మణుల కష్టాలు అడిగి తెలుసుకున్న చంద్రబాబు నాయుడు ప్రతి కుటుంబానికి షాపు, ఇల్లు కల్పించడంతో పాటు పనిముట్లు ఇప్పిస్తామని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. అలాగే రాష్ట్రంలోని దేవదాయశాఖ ఆలయాల్లో నాయీబ్రాహ్మణులకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు టీటీడీలో పని చేస్తున్న పీస్‌రేట్ బార్బర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అధికారం చేపట్టి పది నెలలు గడుస్తున్నా వాగ్దానాల ఊసే ఎత్తకపోవడం విడ్డూరమని తెలిపారు. గతంలో ప్రభుత్వంలో నవరత్నాల ద్వారా క్షవర వృత్తిదారులు, వృత్తిలోలేని వారు ఎంతో లబ్ధి పొందారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నాయీ బ్రాహ్మణుల జీవన మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని వాపోయారు.

పంట నష్టం

బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని వెస్టువరత్తూరులో బుధవారం రాత్రి కురిసిన అకాల వర్షంతో రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ఒక్క సారిగా అకాల వర్షం ఈదురుగాలులతో విరుచుకుపడింది. దీంతో 5 ఎకరాల్లోని కాకర పంట దెబ్బతింది. కాకర చెట్ల కోసం వేసిన పందిళ్లు గాలీవానతో నేలకూలాయి. 20 ఎకరాల్లోని మామిడి కాయలు నేలరాలాయి.

– బుచ్చినాయుడుకండ్రిగ

